క్లుప్తంగా

చదువుతోనే సంపూర్ణ జ్ఞానం

న్యాయమూర్తి స్వాతి రెడ్డి



వంటను పరిశీలిస్తున్న స్వాతిరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతోనే సంపూర్ణ జ్ఞానం లభిస్తుందని తద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ సెక్రెటరీ, న్యాయమూర్తి స్వాతి రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకోడూరు శివారులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులకు అందించే భోజనం, తరగతి గదులు, హాస్టల్‌ను పరిశీలించారు. అధ్యాపకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువే అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుందన్నారు. ప్రిన్సిపాల్ స్నేహలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

హుస్నాబాద్‌రూరల్: చెన్నైలో బుధవారం నుంచి జరగనున్న సౌత్ ఇండియా యూనివర్శిటీ కబడ్డీ పోటీలకు హుస్నాబాద్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ మడక కృష్ణ సోమవారం తెలిపారు. కరీంనగర్ శాతవాహన యూనివర్శిటీలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో హుస్నాబాద్ క్రీడాకారులు గడిపె సిద్ధు, ఎండీ. అల్ఫాజ్, కోయిలకరి శ్రీశైలం పాల్గొని ప్రతిభ చూపారు. యూనివర్శిటీ కబడ్డీ జట్టుకు గడిపె సిద్ధు కెప్టెన్‌గా సారథ్యం వహించనున్నాడు. వారి ఎంపికపై మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు అభినందించారు.

భూగర్భ జలాలపై అవగాహన



మాట్లాడుతున్న నాగరాజు

మద్దూరు(హుస్నాబాద్): భవిష్యత్ తరాల అవసరాలకు భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని జిల్లా భూగర్భజల అధికారి నాగరాజు పిలుపునిచ్చారు. మండలంలోని నర్సాయపల్లిలో సోమవారం భూగర్భజలాల నిర్వహణ అభివృద్ధిపై రైతులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, రాక్ ఫిల్‌డ్యామ్‌లు, కందకాలు లాంటివి నిర్మించుకోవాలన్నారు. ప్రతి నీటి బొట్టును వృథాగా పోకుండా ఒడిసి పట్టాలని సూచించారు. అంతకు ముందు గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ పౌజియ, స్వరూప, రాజ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గంగాధర్

హుస్నాబాద్: హెచ్‌ఐవీ లేని సమాజాన్ని నిర్మించాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన అవసరం అన్నారు. అనంతరం ఐసీటీసీ కౌన్సిలర్ తిరుపతి మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకిన వారిపై ఆదరణ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి రణధీర్ కుమార్, అధ్యాపకులు ఎస్‌ఎస్ రాజు, ఎల్లయ్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ వన్‌టౌన్ పీఎస్ ఫీడర్ పరిధిలోని చెట్లకొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగమ్మతోట, శర్వాదాస్, నజీర్‌పూర, చిన్నమసీద్ ప్రాంతాలలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంధకారంలో హమాలీ కాలనీ

- వెలగని వీధి దీపాలు
- చీకటి, పాములు, తేళ్ల మధ్యే జీవనం
- అవస్థలు పడుతున్న కార్మికులు



హమాలీ కార్మికుల డబుల్‌బెడ్రూం ఇళ్లు

దుబ్బాక: విద్యుత్ దీపాలు లేక హమాలీ కార్మికులు చిమ్మచీకట్లోనే.. పాములు, తేళ్ల మధ్య ప్రతిరోజు దినదినగండంగా బతుకుతున్నారు. దుబ్బాకలోని ఒకటో వార్డు పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనే రెండెకరాల స్థలంలో హమాలీ కార్మికుల కుటుంబాల కోసం దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి హయాంలో సుమారుగా జీప్లస్‌-2 పద్ధతిలో 90 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారు. యేడాది క్రితం మిగిలిన పనులు పూర్తి చేయడంతో కార్మికులు ఆ ఇళ్లలో చేరారు. నీటి వసతి కల్పించినప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదు. మిగతా చాలా సమస్యలు ఉండడంతో కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిమ్మచీకట్లలోనే బతుకులు

డబుల్ బెడ్రూం కాలనీలో విద్యుత్ స్తంభాలు వేసినప్పటికీ లైట్‌లు అమర్చలేదు. దీంతో రాత్రివేళలో ప్రజలు చిమ్మచీకట్లలోనే జీవనం సాగిస్తున్నారు. కాలనీ చుట్టూ చెట్లు, పొదలు అలముకొని ఉండడంతో పాములు, తేళ్లు నిత్యం ఇళ్లలోకి వస్తున్నాయి. భయంతో దినదినగండంగా గడుపుతున్నామంటూ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, కాలనీకి వచ్చే రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

పాములు, తేళ్లతో ఇబ్బందులు



ప్రతిరోజు పాములు, తేళ్ల మధ్యే నివశిస్తున్నాం. నిత్యం విషపురుగులు ఇళ్ల మధ్య సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి భయటకు రాలేని పరిస్థితి. ఎప్పుడు ఏం జరుగుతుంతో తెలియని దుస్థితిలో ఉన్నాం. అధికారులు స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలి.

\- గడ్డమీది లక్ష్మీనర్సయ్య, డబుల్‌బెడ్రూం వాసి

చీకటిలోనే బతుకులు వెళ్లదీస్తున్నాం



తమ డబుల్ బెడ్రూం కాలనీలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకటి పడితేచాలు భయంభయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణానికి దూరంగా.. వ్యవసాయ పొలాల సమీపంలో ఉండడంతో రాత్రివేళల్లో ఏం జరుగుతుంతో తెలియని భయంతో గడుపుతున్నాం. కాలనీలో చాలా సమస్యలు ఉన్నాయి.

\- మాదుగుల కిషన్, డబుల్‌బెడ్రూం వాసి

ప్రతిభను వెలికితీయడానికే ‘చెకుముకి’

ఎంఈఓ కృష్ణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ చాలా ఉపయోగపడుతుందని ఎంఈఓ కృష్ణ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పేరిట ప్రతియేటా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ ప్రతియేటా నవంబరు, డిసెంబరు నెలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే నెల 7న పాఠశాల స్థాయిలో, 21న మండల స్థాయిలో, 28న జిల్లా స్థాయిలో ఈ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలమైన ప్రభుత్వం

సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాల స్వామి



నినాదాలు చేస్తున్న గోపాల స్వామి తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి విమర్శించారు. ఆ పార్టీ మహాసభల సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ యేడాదికి కోటి ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. రాష్ట్రంలో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫమలమైందని, సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యదర్శిగా మద్దెల అంజయ్యను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు భిక్షపతి, శంకరయ్య, లక్ష్మయ్య, సాయిలు, సత్తిరెడ్డి, రాములు, రమేశ్, పరశురాములు, ముత్తవ్వ, గాలవ్వ, పోచవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): గజ్వేల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1983–84 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం వర్గల్ మండలంలోని గౌరారంలోని ఓ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సందడిగా గడిపారు.



గుమ్మడి తోటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

బూడిద గుమ్మడి సాగుతో మంచి లాభాలు

అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: రైతులు తక్కువ ఖర్చుతో మంచి లాభాలు గడించాలంటే గుమ్మడి సాగు ఎంతో మేలని అర్బన్ మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ సూచించారు. మండలంలోని వెల్కటూరులో బూడిద గుమ్మడి, గుమ్మడి కాయల సాగుతో లాభాలు ఆర్జిస్తున్న రైతు బాలకృష్టారెడ్డి పొలాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూడిద గుమ్మడి సాగుకు ఖర్చు తక్కువగానే ఉంటుదన్నారు. కేవలం 110 నుంచి 115 రోజుల వ్యవధిలో దిగుబడి వస్తుందని చెప్పారు. ఎకరాకు నాలుగు టన్నుల వరకు దిగుబడి వస్తుందని, కిలో రూ.10చొప్పున టోకుగా అమ్ముకున్నా ఎకరాకు రూ.40వేల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి టన్నుకు రూ.18వేల వరకు ధర పలుకుతుందని చెప్పారు. రైతు బాలకృష్టారెడ్డి 5 ఎకరాల్లో గుమ్మడి, మరో 10 ఎకరాలలో నూతన వరి వంగడం ఆర్‌ఎన్‌ఆర్ 28361 సాగు చేస్తున్నారని, వరి కూడా బాగుందని చెప్పారు.

రుణమాఫీకి షరతులు ఉండొద్దు

రైతు సంఘం జిల్లా నేత తిరుపతిరెడ్డి

సిద్దిపేటరూరల్: ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తానన్న రూ.2లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లారపు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో అర్హులైన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అందించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని, రైతు భరోసాను కూడా అందజేయాలన్నారు. సన్నరకం వడ్లతో పాటుగా దొడ్డు రకం వడ్లకు కూడా రూ.500ల బోనస్ అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్తిరెడ్డి, బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిగుల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

దళారులకు అమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్సీ యాదవరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ యాదవరెడ్డి సూచించారు. ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి మండలంలోని తిగుల్, మునిగడప గ్రామాల్లో సోమవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఓ వసంతరావు, ఏపీఎం కిరణ్, డైరెక్టర్లు హరినాథ్, భూమయ్య, సీసీలు బాబు, రవి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

ఎస్‌జీటీయూ నాయకులు



ఎంపికైన నూతన కార్యవర్గం

గజ్వేల్‌రూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఎస్‌జీటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎస్‌జీటీయూ(సెకండరీ గ్రేడ్ టీచర్ యూనియన్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జోగన్నగారి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా బోడ వేణు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా మంజుల ఎంపికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బాధితులందరికీ షరతులు లేకుండా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

దీపావళి అనంతరం గ్రామాల్లో సర్వే

ఎంపీడీఓ జయరామ్



మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరామ్

అక్కన్నపేట(హుస్నాబాద్): దీపావళి పండుగ తర్వాత గ్రామాల్లో కొనసాగనున్న సర్వేకు పంచాయతీ కార్యదర్శులంతా సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ భానోతు జయరామ్ సూచించారు. అక్కన్నపేట మండల రైతు వేదికలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లకు సర్వేపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టనున్న ఈ సర్వేలో అధికారులందరూ పాల్గొనాలన్నారు. విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతరెడ్డి, సీడీపీఓ జయమ్మ, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులు తీసుకోవద్దు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం చేపడుతున్న సోషల్ ఎకనమిక్ సర్వేపై తహసీల్దార్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తయ్యే వరకు మండల, గ్రామస్థాయి అధికారులు సెలవులు తీసుకోవద్దన్నారు. గ్రామ, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుమారస్వామి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎస్‌కే అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



కంప్యూటర్ ప్రారంభిస్తున్న ఎంఈఓ

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని ఎంఈఓ ఆర్.పద్మయ్య అన్నారు. మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు దాతలు బహూకరించిన కంప్యూటర్, ప్రింటర్‌లను ఆయన సోమవారం ప్రారంభించారు. బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ రూ.50వేల విలువ గల కంప్యూటర్, ప్రింటర్‌లను పాఠశాలకు అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతలు తమ సహాయం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అశోక్‌రెడ్డి, కనుకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లం రాజు సేవలు మరువలేనివి

నివాళులర్పించిన ఎంపీలు, నేతలు

గజ్వేల్‌రూరల్: మాజీ సర్పంచ్ అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను పలువురు ప్రజాప్రతినిధులు పరామర్శించారు. మండల పరిధిలోని కొల్గూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లం రాజు(57) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స కోసం ఆయన కుటుంబ సభ్యులు కర్ణాటకలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, పలువురు సోమవారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లం రాజు గతంలో ఎంపీపీగా, మాజీ సర్పంచ్‌గా ప్రజలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 16 మంది వాహనదారులు పట్టుబడ్డారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రూ.26 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ధ్రువపత్రాల పరిశీలన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఎంపికయిన అభ్యర్థుల ధ్రువపత్రాలను 29, 30న పరిశీలించనున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి 5గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, అభ్యర్థులు నిర్ణీత సమయంలో హాజరుకావాలని సూచించారు.

◆ పోలీస్ స్టేషన్ తనిఖీ

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ మధు సోమవారం తనిఖీలు నిర్వహించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు, పెండింగ్ ఫైల్స్, కేసుల వివరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎస్‌ఐ ఆసీఫ్ ఆయనకు పూలమొక్కను అందజేసి మండల స్థితిగతులు, కేసుల వివరాలను తెలియజేశారు.

◆ మట్టి తరలిస్తున్న వారిపై కేసు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గులోని చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు సోమవారం తెలిపారు. గ్రామంలోని చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తవ్వి రవాణా చేస్తున్న ఆరుట్ల బాబు, రేపాక వెంకటేశ్, తూర్పటి బాబుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

◆ తహసీల్దార్‌ల బాధ్యతల స్వీకరణ

దుబ్బాకటౌన్/మద్దూరు(హుస్నాబాద్): దుబ్బాక మండల నూతన తహసీల్దార్‌గా సంజీవ్ కుమార్, మద్దూరు తహసీల్దార్‌గా ఎండీ ఏజీ రహీమ్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. మద్దూరు తహసీల్దార్‌గా పనిచేసి సాధరణ బదిలీలో భాగంగా సంజీవ్ కుమార్ దుబ్బాకకు వచ్చారు. అలాగే దుబ్బాకలో పనిచేసిన వెంకటరెడ్డి సిద్దిపేట రూరల్ మండలానికి బదిలీ అయ్యారు. అలాగే ఖమ్మం జిల్లా వైరా మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రహీమ్ పదోన్నతిపై మద్దూరు తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. వారిని ఆయా కార్యాలయాల సిబ్బంది సన్మానించారు.

◆ సర్దుబాటు చేయాలని మంత్రికి వినతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించవద్దని జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును వేడుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ 15యేళ్లుగా పనిచేస్తున్నామని, తమను ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల్లో సర్దుబాటు చేయాలని విన్నవించినట్లు చెప్పారు.

◆ ఎల్‌ఐసీ ఏజెంట్ల ధర్నా



హుస్నాబాద్: ఎల్‌ఐసీ పాలసీదారులు, ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట సోమవారం ఎల్‌ఐసీ ఏజెంట్లు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాలసీదారులకు బోనస్ పెంచాలని, ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలన్నారు. కుదించిన లక్ష రూపాయల పాలసీని కొనసాగించాలని, లోన్‌లపై వడ్డీ తగ్గించి అనువైన పాలసీలు అందించాలని డిమాండ్ చేశారు. లియాఫీ అధ్యక్షుడు బాపురావు, ప్రధాన కార్యదర్శి వీరాస్వామి, నాయకులు కొమురెల్లి, నాగభూషణం, ప్రేమ్‌కుమార్, రాములు, రామాచారి, దామోదర్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం

కొండపాక(గజ్వేల్): పేదలు కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో దోహదపడుతోందని మాజీ సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో బాధితులకు మంజూరైన చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదవారికి సీఎంఆర్‌ఎఫ్ ఆసరాగా నిలుస్తోందన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

◆ కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన మహిళ

మర్కూక్(గజ్వేల్): మతిస్థిమితం లేక ఇంటి నుంచి బయటకెళ్లిన వృద్ధురాలు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా మర్కూక్ మండలం పాతూరులో గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా నంగునూర్‌కు చెందిన గుండమైన విమల తన కుమారులతో పాటు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఐదు రోజుల క్రితం కిరాణా షాపునకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో ఆమె కుమారులు చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. సోమవారం పాతూరు(హైదరాబాద్‌కు 50కిలో మీటర్ల దూరం)లో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకొని విమల వద్ద వివరాలను సేకరించి తన కుమారుడు వెంకటేశ్‌కు సమాచారం అందించి అప్పగించారు.

◆ సోషల్ మీడియా ఇన్‌చార్జి నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన బొడిగె మహేశ్‌గౌడ్ నియమిస్తూ సేవాదళ్ జాతీయ కన్వీనర్ ప్రవీణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.